నల్ల పోచమ్మ పలుగుట్ట నూతన కార్యవర్గం


2


2

హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## కవి సింగీతం సంతోష్ కుమార్‌కు ప్రశంసాపత్రం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** 'నేను సైతం' రచయితల సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా 'ఆదర్శ ప్రాయుడు శ్రీరాముడు' అను అంశంపై కవిత పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సింగీతం సంతోష్ కుమార్ ప్రతిభ కనబర్చినందుకు ఆన్‌లైన్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, కవులు, కళాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



# కనుల పండువగా రాములోరి కళ్యాణం..





ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. జిల్లాలోని రామాలయాలన్నీ సీతారాముల కల్యాణోత్సవాలతో, ప్రత్యేక పూజలతో భక్తులతో కిటకిటలాడాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణం జరిగింది. జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ దంపతులు, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గౌడ్ దంపతులు, మేయర్ ఉమారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల దంపతులు రాములవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సుభాష్‌నగర్ రామాలయంలో, గాజుల్‌పేట్ పెద్ద రామ్‌మందిర్‌లో కల్యాణానికి భక్తులు తరలివచ్చారు. కామారెడ్డిలోని రైల్వేస్టేషన్ ఆవరణలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని రామ్‌మందిర్‌లో కల్యాణం నిర్వహించారు. పంచముఖి హనుమాన్ ఆలయంలో కల్యాణానికి భక్తులు తరలివచ్చారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

– మిగతా ఫోటోలు 2వ పేజీలో..

## కష్టపడ్డ వారికి పార్టీలో పదవులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పార్టీ కోసం కృషి చేసే ప్రతి కార్యకర్తను గుర్తించి తగిన గౌరవం కల్పిస్తామని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మంచిర్యాల విద్యాసాగర్ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే మదన్ మోహన్ నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్ష పదవి అప్పగించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్ దశరథ్, కాంగ్రెస్ నాయకులు తమ్మల శ్యామ్, పప్పు వెంకటేశం పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం స్థానిక సర్పంచ్ లావణ్య వెంకాగౌడ్ సందర్శించారు. కూలీలకు మజ్జిగ పాకెట్లు, ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కూలీకి చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతులు కల్పించాలని, కూలీల హాజరు, పనుల కొలతలు కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు త ప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్, పోతరాజు తుకారాం, వడ్ల భాగయ్య, కోటారి గంగవ్వ, ప్రవీణ్ గౌడ్, డాక్టర్ సంజీవులు, భాను గౌడ్, సింగం సంతోష్, మహేందర్ గౌడ్, గౌస్, ఆకుల రవీందర్ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికురాలి అంత్యక్రియలకు ఆర్థికసాయం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వెల్లుట్లపేట గ్రామంలో గతంలో పారిశుధ్య కార్మికురాలిగా సేవలందించిన వడ్డే రాజవ్వ శుక్రవారం మృతి చెందింది. ఆమె దహన సంస్కారాల కోసం సర్పంచ్ కొయ్యల వినోద రాజా గౌడ్, ఉప సర్పంచ్ కర్రి చెవుల రాజు యాదవ్, వార్డు సభ్యులు గాండ్ల సాయిరాం, మాజీ వార్డు సభ్యులు కొట్టాల బాలాజీ కలిసి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి సేవచేసిన ఆమెకు సాయమందించి మానవత్వాన్ని చాటారు.



## ఇందూరు మట్టిలో పుట్టిన ఏ ఆలోచనైనా విజయమే

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ మట్టిలో పుట్టిన ఏ ఆలోచనలైనా ఇప్పటివరకు విజయాలు సాధించాయని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అందుకే ఇందూరు నుంచే పార్టీ స్థాపన ప్రకటన చేస్తున్నాన్నారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

### 33 మొక్కజొన్న కేంద్రాలు అవసరమైతే..

నిజామాబాద్ నుంచి తీసుకున్న ఎన్నో ఆలోచనలు యావత్ దేశాన్ని ప్రభావితం చేశాయని కవిత అన్నారు. తాను నిజామాబాద్ కోడలినని.. తెలంగాణ బిడ్డనని అందుకే తొలి ప్రకటన ఇక్కడ నుంచి చేయాలనే నిర్ణయించుకున్నానన్నారు. నిజామాబాద్ జిల్లాలో 32వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైందన్నారు. దీనికి సంబంధించి ఇక్కడ అధికారులు 33 కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారన్నారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క కేంద్రం కూడా ఏర్పాటు చేయక పోవడం మక్క రైతులను నిర్లక్ష్యం చేయడమేనని తెలుస్తోందన్నారు. దీంతో దళారులు తక్కువ ధరకు మక్కలు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు

### మోతె మట్టితోనే తెలంగాణ సిద్ధించింది..

భారతదేశంలో 16 జనపదాలు ఉంటే బోధన్‌లో అస్మక జనపదం ఉండేదని కవిత చెప్పారు. గొప్ప చరిత్ర మన నిజామాబాద్‌కు ఉందన్నారు. జిల్లాలోని మోతే మట్టి మహిమతో తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. ఇందూరు జిల్లా దేశంలోనే ప్రత్యేకత సాధించిందన్నారు.

### రాములవారికి పట్టు వస్త్రాల సమర్పణ..

ఖిల్లా రాంమందిర్‌లో శ్రీరామ నవమి వేడుకల్లో కవిత తన భర్త అనిల్‌తో కలిసి పాల్గొన్నారు. వీరు సీతారాములకు పట్టు వస్త్రాలను సమర్పించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజవవర్గ పరిధిలోని వివిధ రామాలయాలకు కవిత దంపతులు పట్టు వస్త్రాలు పంపించారు. బోధన్, ఆర్మూర్ సిద్దుల గుట్ట, పోచంపాడ్, జగిత్యాల ధరూర్ క్యాంప్, విద్యానగర్ రామాలయం, మల్లాపూర్ మండలంలోని వాల్గొండ రామాలయాల్లో కవిత తరపున ప్రతినిధులు పట్టువస్త్రాలు అందజేశారు.

## కిసాన్‌నగర్‌లో అంబలి కేంద్రం ప్రారంభం



**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని కిసాన్ నగర్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. వేసవికాలంలో ప్రయాణికులు, పాదచారుల దాహం తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అంబలి పంపిణీ కార్యక్రమం 60 రోజుల పాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ ముందుండి పాల్గొనాలని, వేసవిలో ఇది ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమమని అన్నారు.





## ఒకే వేదికపై పీసీసీ చీఫ్, కవిత రాజకీయ వర్గాల్లో ఆసక్తి..

నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కల్యాణంలో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. నిత్యం ఒకరిపై ఒకరు విమర్శలు.. ఆరోపణలతో బిజీగా ఉండే రాజకీయ నాయకులు ఇలా ఒకే వేదికపై కల్యాణంలో పాల్గొనడంపై సర్వత్రా ఆసక్తి రేకెత్తించింది. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

